
# నిరుద్యోగి... ప్రశ్న?



* రచన: శ్రీ పి.వి.డి.ఎస్. మూర్తి. *

[గతసంచిక తరువాయి]

"థాంక్యూసార్స్" అని కుర్చీలో కూర్చున్నాడు.

రాము అప్లికేషన్‌ను ఒకసారి మొదలంతా చూసాడు వారిలో మరొక ఆఫీసరు, తరువాత ఇంటర్వ్యూ మొదలయింది. ముందుగా–

"మీ పేరు" అడిగాడు వేరొక ఆఫీసరు.

సమాధానం చెప్పాడు రాము.

"మీ ఊరు?

మళ్ళీ అదే వ్యక్తి! జవాబిచ్చాడు రాము. తరువాత వయస్సు, అర్హతలు ఇలా అన్ని వివరాలు ఒక దాని తరువాత ఇంకొకటి అన్ని వివరాలు తన గురించి అడిగాడు. అప్పుడు "ఈ ఉద్యోగం మీకెందుకు' అన్నాడు ఆఫీసరు.

మతిపోయింది రాముకు ఒక్కసారిగా. కొద్దిగా తమాయించుకొని "బ్రతుకు తెరువు కోసం" అన్నాడు.

చివరి ప్రశ్నగా ఇంకొక ఆఫీసరు "ఇప్పుడు మీరు ఇక్కడకు ఎన్ని మేడ మెట్లు ఎక్కివచ్చారు" అని అడిగాడు.

మళ్ళీ అదిరిపడ్డాడు రాము. ఒక్కసారి అరికాలి నుండి నడినెత్తికి ఎక్కింది కోపం. కానీ, అవసరం తనదని గుర్తించి "ఏమో, తెలీదు" అని మాత్రం అన్నాడు.

"సరే, ఇక మీరు వెళ్ళవచ్చు" అన్నాడు మళ్ళీ ఆ ఆఫీసరు. "థేంక్యూసార్స్" అని చెప్పి వెనుతిరిగాడు తను. ఇంటర్వ్యూ జరిగిన, జరిపిన పద్ధతిని బట్టి ఆ ఉద్యోగం తనకు ఇవ్వరని తెలుసుకున్నాడు, ఇదొక అనుభవం రాముకు.

ఒకరోజు సాయంత్రం గ్రంథాలయాల్లో దిన పత్రికలు చూస్తున్నాడు. ప్రత్యేకించి ఉద్యోగ ప్రకటనలను చూస్తున్నాడు.

వాటిలో ఎక్కడ చూసినా హరిజన, గిరిజనులకే ఉద్యోగ ప్రాధాన్యత. ఇతర అభ్యర్థుల గురించి ఎక్కడా కనబడటంలేదు. "ఎక్కడన్నాఉన్నా పేరుకు ఒకటో అరో మాత్రమే. రోజూ అటువంటి ప్రకటనలే చూస్తున్న రాముకు ఇంక అవి చూడబుద్ధికాక ప్రక్కనే ఉన్న ఒక పార్కులోనికి వెళ్ళి కూర్చున్నాడు. అక్కడ రేడియోలో ఏదో కార్యక్రమం వినవస్తుంది. కొంత సేపటికి ఆకార్యక్రమం పూర్తి అయిపోయింది. తదుపరి కార్యక్రమంగా ఆరేడియోలో ఉద్యోగ ప్రకటనలు ఒక పావుగంట సేపు వినిపించారు. కానీ, ఆశ్చర్యమేమిటంటే అప్పుడు చెప్పిన వాటిలో కూడా మొత్తం దేశంలో అన్నిచోట్లా, అన్ని ఆఫీసులలోనూ అన్ని ఉద్యోగాలకు కావలసినది హరిజనులూ, గిరిజనులే. ఇటువంటి రేడియో ప్రకటనలు వినటం అలవాటు అయివుండటంతో మరింత విసుగనిపించి ఇక అక్కడ కూడా ఉండలేక అటు ప్రక్కనే ఉన్న రైల్వే బ్రిడ్జి వైపుకు సాగాడు రాము. బ్రిడ్జిగట్టుపై కూర్చున్నాడు తను. అంతలో ఒక రైలు పెద్దగా శబ్దం చేసుకుంటూ వచ్చి బ్రిడ్జిమీద నుండి దూసుకు పోతుంటే ఆ శబ్దంలాగే తనమనస్సులో కూడా అనేక ఆలోచనలు చెలరేగుతున్నాయి.

• • •

"ఈనాడు ఎక్కడ చూసినా, ఏ ఉద్యోగానికైనా కావలసినది హరిజనులు, గిరిజనులే. వారికి కనీస విద్యార్హత కూడా లేకపోయినా వారికే ఉద్యోగాలన్నీ. పేరుకు

మాత్రం హరిజనులు, గిరిజనులు లభించకపోయిన వస్తుములో ఇతరులకు ఇస్తామంటారు. కానీ ఆ ఖాళీలన్నీ భర్తీ కాకుండానే ఉంటున్నాయి. ఇలా చాలా వాటికి అభ్యర్థులు లభించటం లేదు కూడా. కారణం వారి సంఖ్య పరిమితం కావటమే. చూస్తుంటే అభ్యర్థులు తక్కువ, అవకాశాలు ఎక్కువ అనిపిస్తుంది. అదే సమయములో ఇతర కులాలలో పుట్టటం శాపంగా కూడా తలపోయవలసి వస్తుంది. లేకుంటే, ఏనాడో ఆ కులాలవారికి అన్యాయం జరిగిందని ఈనాడు మిగతా కులాల వారికి అన్యాయం చేస్తే ఎలా? నిజమే! చితికి పోయిన వారికి చేయూత నివ్వవలసిందే. అలా అని మిగతా వారిని అదఃపాతాళానికి తొక్కేస్తే ఎలా? ఎవరీ బలహీన వర్గాలు? అటువంటి ప్రాధాన్యం ఇవ్వదలచుకున్నప్పుడు ఆర్థికంగా వెనుకబడిన వారందరికీ ప్రాముఖ్యత నివ్వాలి గాని మిగతా వారిని మనషులు కానట్లుగా భావించటం భావ్యమా? ఒక ప్రక్క సర్వమానవ సౌభ్రాతృత్వం కావాలని బహిరంగంగా అనేక రకములుగా ప్రకటిస్తూనే, ప్రబోధలు చేస్తూనే ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడితే ఇక ఎక్కడనుండి వస్తుంది ఈ సర్వమానవ సౌభ్రాతృత్వం? ఈ ధోరణిని చూస్తుంటే ఇప్పటికి బ్రతికి ఉన్నంత వరకూ అన్ని విషయాలలోనూ కొన్ని వర్గాలవారికే ప్రాముఖ్యత ఉంది. ఇది ఇల్లాగే సాగితే కొన్నాళ్ళకు చచ్చిన పిదప అంత్య క్రియలకు కూడా ఈ ప్రాముఖ్యత వర్తించే దశకు చేరుకుంటుదేమో! అని అనిపిస్తుంది. ఒకవేళ అలా జరిగినా ప్రస్తుతం మనం అనుభవిస్తున్న పరిస్థితుల దృష్ట్యా ఆశ్చర్యపడవలసిన అవసరం కూడా లేదేమో! నిజానికి సంఘం అన్న తరువాత దాని మనగడకు అన్ని కుల, మత, వర్ణ, వర్గాలవారు కావలసిందే. ఏ ఒక్కరు లేక లేకపోయినా అది సంపూర్ణ సంఘం కాదు. దానికి ఎప్పటికీ ఏదో ఒక రకమైనలోటే. మరి అటువంటప్పుడు ఇటువంటి తేడాలు, భేదభావాలు ఉండటం సమంజసమా? అగ్రకులాలలో పుట్టిన పాపానికి తినతిండిలేక, కట్టుకొను గుడ్డలేక, నిలువ నీడ లేక, చదువ సీట్లులేక, చేయ ఉద్యోగాలులేక జానెడు పొట్టకోసం చెయ్యరాని, చెయ్యకూడని నీచ, నికృష్టకార్యాలు కూడా చేసే స్థితిలో ఉన్నా, కేవలం కుల ప్రాతిపదికపై వారికి వారి అర్హతలనుబట్టి బ్రతుకు తెరువు చూపించకపోగా, నియమిత బలహీన వర్గాలలో పుట్టిన పుణ్యాన కనీస అర్హతలు కూడా లేకపోయినా, పొట్టగడిచే ఇబ్బందులు లేకపోయినా, జరుగుబాటుకు లోటు లేకపోయినా,





మా వద్ద...

"టర్కీస్ డాక్టర్"

♦ ఫైన్ జెట్టి. ♦ పోలింగ్ అయిలెట్.
♦ ఇంటర్‌లాక్. ♦ ఫేన్సీరకాలు.

రీసైజు, అన్ని విధములైన బనియన్లు,
అన్ని రకాలలోనూ దొరకును.

★

ఆర్డరను వెంటనే గమనించి పంపబడును.

**Turkey Knittings**
D-94 (I), Lakshmi Nagar
TIRUPUR-638 602



"ఇన్‌స్పెక్టర్ జగన్" చిత్రంలో కవిత-సత్యేంద్రకుమార్

అవకాశాలన్నిటినీ ఇటువంటి వర్గాల వారికే ఈయటం అన్యాయం కాదా?

ఏనాడో అనూహ్యంగా హరిజనులూ, గిరిజనులూ మొదలైనవారికి అన్యాయం జరిగితే జరిగి ఉండవచ్చు. అది ఎంతవరకూ జరిగినదీ, ఎలా పరిణమించినదీ సమస్త జగానికీ తెలిసినదే.

వారికి సంఘంలో ఒక ఉన్నత స్థానంగానీ కనీసం మామూలు సభ్యులుగా కూడా మసలటానికి ఆస్కారం లేకుండా చేసాయి ఆనాటి పరిస్థితులు. కానీ, ఆనాడు అటువంటి పరిస్థితులలో కూడా వారి జీవన విధానానికీ, జీవన భృతికీ, బ్రతుకు తెరువుకూ, వారి వారి కార్యకలాపాలకూ కూడా ఎటువంటి అడ్డు, ఆటంకం కలుగలేదు.

సంఘంలో గౌరవప్రదమైన స్థానం లేదన్న బాధే తప్ప, ఆనాడు కూడా వారికి కూడు, గూడు, బట్టలకు ఏనాడూ లోటురాలేదు. వారికి నియమితమైన, ప్రత్యేకమైన వృత్తులు వారికే పరిమితమై ఎంతమందికైనా ఉపాధిని కల్పించగల శక్తి ఆనాడు ఉండటమే దానికి మూలకారణం. మరి నేడు? ఉన్నతవర్గాలుగా, ఒక్క మాటలో చెప్పాలంటే హరిజనులు, గిరిజనులు కాని వారందరూ అలా పుట్టిన నేరానికి నిరక్షరాస్యులు, అక్షరజ్ఞానం కలవారు, విద్యాధికులు యావన్మందికీ ఏవిధమైన జీవనోపాధీ లేక బ్రతుకు తెరువునకు ఏవిధమైన మార్గమునకు నోచుకోక ఆకలిదప్పులతో అలమటించి పోతున్నారు కొన్ని కోట్లమంది మానవులు నేడు. ఆనాడు ఆ పరిమిత వర్గాలకు జరిగిన అన్యాయం గురించి చెప్పుకోవటానికి వారుగానీ, లేక వారి గురించి ఆలోచించటానికి, చర్చించటానికీ ఉన్నత వర్గాలుగా పేరు పొందిన వారిలో కూడా కొందరు ఉత్తములు కానీ ఉన్నారు. తిండికి లోటు లేని పరిస్థితివల్ల ఆనాడు అలా ఉంది. కానీ ఈనాడు? ఇప్పటి పరిస్థితి మరికొన్నాళ్ళో, కొన్నేళ్ళో ఇలాగే కొనసాగితే ఆకలి చావులు ఎక్కువై ఇంచుమించుగా సమాజమే స్మశానమైపోతే ఆనాడు ఎవరు ఎవరితో మొర పెట్టుకోవాలి? మొర పెట్టుకుంటారు? ఎవరు ఎవరిని గురించి ఆలోచించాలి? ఆలోచిస్తారు? అటువంటి పరిస్థితి ఈ నవనాగరిక సభ్య సమాజానికి ఎదురవకుండా చూడవలసిన బాధ్యత నేటి ఈ ప్రభుత్వయంత్రాంగానిది కాదా?

అయినప్పుడు ఇంకా ఈ నాయకులు దిన, వార, పక్ష, మాస, త్రైమాస పత్రికలలోనూ, ఏ సభలోనైనా, ఏ సమావేశానికి వెళ్ళినా ఇంకా హరిజనులు, గిరిజనులకు ఇంచుమించు మరోపదేళ్ళైనా ఇప్పుడు ఉన్న అభివృద్ధి కార్యక్రమాలను అమలు జరపాలి, ఇంకా కొన్ని అదనపు సౌకర్యాలను కలుగజేసి వారి పరిస్థితులను, స్థితిగతులను

పెరుగు పరచాలి అని చెప్పే ఉపన్యాసాలకు అర్థమేమిటి? అందుకే దీనికంతటికీ పరిష్కార మార్గమొక్కటే!

ఇటువంటి విషపరిణామాలు మన సమాజానికి ఎదురు కాకుండా ఉండాలంటే ప్రాథమికంగా ఈ కుల, మత, జాతి, వర్ణ వర్గ విచక్షణలను సమూలంగా కూకటి వేళ్ళతో సహా పెకిలించి మరి ఎక్కడా, ఎప్పుడూ మొలకెత్త నివ్వకుండా చేసి నామ రూపాలు లేకుండా రూపు మాపాలి.

ఇలాసాగాయి దాము ఆలోచనలు.

* * *

ఒక రోజు దాము తన పెట్టె సర్దుతూ ఉండగా తన సర్టిఫికెట్లలో తన ఎంప్లాయిమెంటు కార్డు కనబడింది. తీసి చూసాడు దాము. కార్డు రెన్యువల్ చేయించటానికి ఇంకా మూడు రోజులే గడువుంది. ఆ రోజే ఆ పని పూర్తి చేద్దామని బయలుదేరాడు.

ఎంప్లాయిమెంట్ ఆఫీసు ఇంకా ఫర్లాంగు దూరము ఉంది. అక్కడ నుండీ ఒక 'క్యూ' ఉంది. అది ఏ సిటీ బస్సుకో, సినిమాహాలుకో అనుకున్నాడు తను. కానీ, తనతోపాటే ఆ 'క్యూ' కూడా ఆఫీసులోనికి దారి తీయటం చూసి ఆశ్చర్య పోయాడు.

“రోజూ వందలూ, వేలమంది కొత్తవారు వస్తూనే ఉంటారు. పేర్లు నమోదు చేయించుకుంటూనే ఉంటారు. ఏమిటో ఆశ! ఉద్యోగం వస్తుందని. కానీ, ఈ ఆఫీసు ద్వారా ఉద్యోగం సామాన్యులకు వస్తుందా? ఏమో! తనకు అనుమానమే. తను తన పేరు ఆ ఆఫీసులో నమోదు చేయించి ఏడు సంవత్సరములు దాటిపోయింది. సుమారు ఏడు సంవత్సరముల క్రితం పదవతరగతి పాసు అయిన వెంటనే తన పేరును ఆ ఆఫీసులో నమోదు చేయించాడు కానీ, ఈ నాటివరకూ ఆ ఆఫీసు ద్వారా తనకు ఒక్క ఉద్యోగానికి కూడా ఇంటర్వ్యూ పిలుపు రాలేదు.

చూడబోతే ఇవి ఉద్యోగాలు ఇప్పించేందుకు కావు, కేవలం రోజు రోజుకూ పెరిగిపోతున్న నిరుద్యోగుల వివరాలన్నీ వ్రాసుకొని బడ్జెట్ లెక్కల్లో ఎస్టిమేషన్‌కు మాత్రమే పనికి వచ్చే వివరాలను తయారు చేసే “అన్ ఎంప్లాయిమెంట్ ఎక్ఛేంచ్”లుగా మారుతున్నాయి. అథవా ఒకరికో, ఇద్దరికో అది ఏడాదికో, రెండేళ్ళకో పిలుపులు పంపినా అవి కేవలం వ్రాతపరీక్షలకు మాత్రమే. ఉద్యోగానికి కూడా మళ్ళీ పరీక్షలు వ్రాయవలసివస్తే ఇక ఇన్ని వేలరూపాయలు, ఇంత విలువయిన కాలము తగలబెట్టి చదువుకున్న దెందుకు? ఈ నాటి ఈ పరిస్థితుల్లో డిగ్రీలు పొందటానికి [అదే 'ఇంత చదివాం' అని చెప్పుకోవటానికి] కొన్నాళ్ళు, కొన్నేళ్ళు పరీక్షలు రాసి పాసయి, ఆ తరువాత ఉద్యోగాలు సంపాదించటానికి మళ్ళీ ఎన్నాళ్ళో, ఎన్నేళ్ళో ఇలా పరీక్షలు రాయటం. పోనీ, అలారాసిన వాటిలోనైనా బాగా రాసిన వాడికి సిన్సియర్‌గా అవకాశం ఇస్తారా అంటే అదీ ఖచ్చితంగా చెప్పలేము. మళ్ళీ అక్కడ మాల్ ప్రాక్టీసే.

ఇలా అనుకుంటూ ఉండగా అంతలో ఆ ఆఫీసుకు ఒక కారు వచ్చింది. అందులో నుండి అయిదుగురు పెద్ద మనుషులుదిగారు. అందులో ఒకాయన ఏదో మంత్రి గారిలా ఉన్నాడు. తను అంతకు ముందు ఆ వ్యక్తిని ఎప్పుడో, ఏదో ఒక బహిరంగసభలో చూసినట్టు గుర్తు. అంతలో అక్కడ వారి మాటలను బట్టి తన సందేహం నివృత్తి అయింది. ఆయన ఒక మంత్రిగారినీ, తన అభ్యర్థి ఎవరికో ఇంటర్వ్యూ పిలుపు రప్పించు కోవటం కోసం అక్కడకు వచ్చాడని తెలుసుకున్నాడు. ఈ ఆఫీసునుండి పిలుపు రప్పించుకున్నాక ఇంటర్వ్యూ పిలుపు రప్పించు కోవటంకోసం అక్కడకు వచ్చాడని తెలుసుకున్నాడు. ఈ ఆఫీసునుండి పిలుపు రప్పించుకున్నాక ఇంటర్వ్యూ జరిగే ఆఫీసులో మళ్ళీ వారి, వారి పలుకుబడి, పరపతి, పెట్టుబడుల యుద్ధాలు, అందులో ఎవరు నెగ్గితే వారికి దక్కుతుంది ఆ ఉద్యోగం, ఆ అవకాశం. ఇన్ని రాజకీయాలు ప్రతిచోటా జరుగుతుంటే ఇక తనవంటి వాడికి ఏ ఉద్యోగమైనా ఎలా దొరుకుతుంది?

తను ఉండవలసిన వరుసలో నిలబడ్డాడు దాము. పని పూర్తి అయింది. కార్డు చూసుకున్నాడు. తిరిగి రెన్యువల్ తారీఖు అప్పటికి మూడు సంవత్సరముల నాటికి రాసి ఉంది. ఏమిటని అడిగాడు గుమస్తాను. పైన ఉన్న బోర్డు చూడమన్నాడు గుమస్తా. లైనులోనుండి పైకివచ్చి బోర్డు చూసాడు దాము.

బోర్డులో రెన్యువల్ కాల పరిమితి వివిధ అర్హతలు

గల వారికి వివిధములుగా ఆ నెల నుండే మార్చుతున్నట్లుగా వ్రాయబడి ఉంది. అది చూసి తనలో తనకే ఆశ్చర్యం వేసింది దామునకు. తను తన పేరు నమోదు చేయించుకున్నప్పుడు రెన్యూవల్ కాల పరిమితి మూడు నెలలు. అది ఎంత, ఏ విద్యార్హతగల అభ్యర్థికైనా ఒకే విధముగా ఉండేది. కానీ, ఈ నాటికి తనకు ఆ కాల పరిమితి మూడు సంవత్సరములైంది. కానీ, ఇంతవరకూ తనకు ఒక్క పిలుపు కూడా రాలేదు. అది కూడా ఇప్పుడు వివిధ అర్హతలుగల వారికి వివిధములుగా ఈ కాల పరిమితి నియమింపబడింది.

"ఉద్యోగాలు ఎలాగూ ఇవ్వలేము. ప్రతి మూడు నెలలకూ ఇలా లక్షల, కోట్లమంది నిరుద్యోగుల పేర్లు తిరిగి రాసి, రాసి కాగితాలు, కాలందండగ చేయుట ఎందుకని, అదీకాక ఇలా రెన్యూవల్ కోసం ఉద్యోగం రాక పోయినా ప్రతి మూడు నెలకూ ప్రతిజిల్లాలోని, ఇంకా దూరం నుండి కూడా ఎంప్లాయిమెంటు ఆఫీసుకు కేవలం ఈ పనికోసం డబ్బు, కాలం ఖర్చు చేసుకొని వచ్చి పని పూర్తి చేయించుకోవటానికి అభ్యర్థులుపడే ఇబ్బందులను గ్రహించి మన ప్రభుత్వంవారు ఈ విధంగా పొదుపు ఉద్యమాన్ని అమలు జరుపుతున్నారేమో?"

(సశేషం)


# కథాంజలి

[చక్కని కథల మాస పత్రిక]

స్థాపితం 1938.

విడి ప్రతి ... 50 పైసలు

సంవత్సర చందా ... రూ. 9-00

(రెండు ప్రత్యేక సంచికలతో సహా)

నేడే చందాదారులుగా చేరండి.

అన్ని హిగ్గిన్ బాథమ్స బుక్ స్టాల్సులో దొరుకును.

♦ కథాంజలి ♦

నెం. 10, మురుగేశ మొదలి వీధి,

మదరాసు - 600 001.


# తెలుగు బాల

★★★

ఆ. సత్యమునకే మాట చాటి చెప్పుట కాని
కానరాదు క్రియలో కనుగొనంగ
చేయలేని పనులు చెప్పుట నేలనో?
తెలిసి మసలుకొమ్ము తెలుగు బాల.

ఆ. చచ్చు విత్తు దెచ్చి గుచ్చగా భూమిలో
పుచ్చుగాని మొలక పుట్టబోదు
కుచ్ఛితునిని వలన ఫలము వర్ధిల్లునా?
తెలిసి మసలుకొమ్ము తెలుగు బాల.

ఆ. మొక్కలోన వంపు చక్కచేయకయున్న
మ్రాను ముదర తీర్చ మనుజు తరమె
బిడ్డ దిద్దుబాటు యిడ్డాల నుండరా?
తెలిసి మసలుకొమ్ము తెలుగు బాల.

ఆ. పదవి యున్నవరకె పరమ పూజ్యుండగు
పదవి పోయెనేని కొదువగలుగు
ఇంటికుక్కనైనఁ గొంట మాపాల్దావ?
తెలిసి మసలుకొమ్ము తెలుగు బాల.

ఆ. కాని కాలమందు కఱ్ఱయే పామయి
కరచువాని తెలివి కసియు కొద్ది
మంచిచేయ చెడ్డమనిషి కెదురేగదా?
తెలిసి మసలుకొమ్ము తెలుగు బాల.

ఆ. ఉన్నవాని చెంత సన్నవాడెపుడును
మంచి బట్టకట్టి మసలగలడె
మఱ్ఱిచెట్టు నీడ మల్లెన పెరుగునా?
తెలిసి మసలుకొమ్ము తెలుగు బాల.

—ఆర్. వామనమూర్తి

★